# మంత్రుల ఇంట్లో పనిమనుషులకూ ఫ్యాక్టరీలు

## దేవేందర్ గౌడ్ చురకలు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** మంత్రుల ఇంట్లో పనిమనుషులు కూడా ఫ్యాక్టరీలు పెట్టారని తెదేపా శాసనసభా పక్ష ఉప నాయకుడు దేవేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో జరిగిన అవిశ్వాసంపై చర్చలో మంత్రి గీతారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల అభివృద్ధికి చర్యలు తీసుకొంటున్నామని, టాటా, బిర్లాలలాగా అభివృద్ధి చేస్తామని అనడంతో దేవేందర్‌గౌడ్ జోక్యం చేసుకున్నారు. 'మీరు చెప్తున్నది నిజమే, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఇంట్లో డ్రైవర్, పనిమనుషులు ఫ్యాక్టరీ పెట్టారు. సోషలిజాన్ని ఎంత బాగా అమలు చేస్తున్నారో' అని అన్నారు. మంత్రి ఇంట్లో వారితో ఫ్యాక్టరీలు పెట్టిస్తుంటే ఇంకేం చేస్తామన్నారు. ఈ సమయంలో సభలోకి హడావుడిగా వచ్చిన మంత్రి జె.సి. దివాకరరెడ్డి జోక్యం చేసుకుని.. త్రిశూల్ సిమెంట్ ఫ్యాక్టరీలో కొందరు నా దగ్గర పని చేస్తున్నవారున్నారు. వారికి నెలకు రూ.పదివేల జీతం. మైనింగ్‌లో అనుభవం ఉంది. ఇప్పటివరకు వారి పెట్టుబడి 2వేల రూపాయలు మాత్రమేనని చెప్పారు. పెట్రోలు బంకులో పని చేసిన వ్యక్తి రిలయన్స్‌కు అధిపతిగా ఎదగలేదా, అంతెందుకు రెండున్నర ఎకరాలున్న చంద్రబాబు ఈ స్థాయికి ఎదగలేదా అని ప్రశ్నించారు.